


రోజులో కనీసం నాలుగు గంటలు ఇలా చిరాగ్గా వుండడం అలవాటైంది నాకు. అలాగని అదో మంచి అలవాటనీ, హాబీలా ఫీలవుతున్నానని కాదు.

నా చిరాకు దేనిమీదో స్పష్టంగా నాకే తెలీదు.

బస్‌లో టికెట్ ఇచ్చేటప్పుడు కండక్టర్ కావాలని నా వేళ్ళను తాకితే ఆ కణం వాడిమీద జాలేస్తుందే తప్ప కోపం రాదు. రోడ్డు మీద రోమియోలు చేసే కామెంట్స్‌కూ నేదే విధంగా స్పందిస్తాను.

ఆఫీసులో సెక్షనాఫీసర్‌చూసే వెకిలి చూపులు కూడా నన్నంతగా బాధ పెట్టవు.

కానీ–

కాఫీలో చక్కెర తక్కువైతే–సప్లయర్ మీద విరుచుకుపడతాను. అంటే కండక్టర్–రోమియో–సెక్షనాఫీసర్–వీళ్ళందరిమీద అజ్ఞాతంగా వున్న నా కోపానికి క్యాంటీన్ వాడు బలైపోతాడన్నమాట.

ఆదుగో–అప్పట్నుంచి చిరాకు ప్రారంభమవుతుంది నాకు. కండక్టర్ నా వేళ్ళను తాకకముందే నేనే వాడికి షేక్‌హ్యాండిస్తే వాడి రియాక్షన్ ఎలా వుంటుంది?

మిగిలిన పాసింజర్స్ ముఖాలు ఎలా వుంటాయి?

రోమియోగాళ్ళు కామెంట్ చేయకముందే – నేనే విజిలేసి కన్నుకొడితే–

ఆఫీసర్‌గాణ్ణి నేనే వెకిలి చూపులు చూస్తే–

వసుంధర బరి తెగించింది

ఇది నాకు మిగిలే అవార్డు

అందుకే చిరాకు నాకు – ఇవన్నీ నన్ను అవమానించే సంఘటనలే అయినా – ఎదురు తిరిగితే నాకే నష్టం

ఆల్‌రైట్ – నేను బరితెగించినదాన్ని అని అనుకుంటే నాకొచ్చే నష్టం ఏమిటి?

"పెళ్ళి కాదే తల్లీ".....అమ్మా నాన్నలు కోరస్‌గా అరుస్తారు.

షిట్ – వెధవ పెళ్ళి ఎవడిక్కావాలి?

తోడు–నీడ–సెంటిమెంట్లు తీసి పక్కనపెడితే–పెళ్ళి అనేది బయొలాజికల్ నీడ్ తీర్చుకోవడానికి సమాజమిచ్చిన ఓపెన్ బ్రోతల్ లైసెన్స్–దట్సాల్

"హలో–ఏవిటంత దీర్ఘంగా ఆలోచిస్తున్నారు?"

తలతిప్పి చూశాను.

పక్క సెక్షన్లో సీనియర్ అసిస్టెంట్–

ఆఫీసు మొత్తంలో తనే గొప్పవాడినన్న ఇగో వీడికి. వీడికి తగ్గట్టు ఆ అమ్మాయిలు టైపిస్ట్ జూనియర్ అసిస్టెంట్ ఇద్దరూ పోటీలు పడి మరీ వీడితో మాట్లాడ్డానికి ప్రయత్నిస్తారు.

దిబ్బరొట్టె మొహం వీడూ–

"ఏమీ లేదు" నవ్వాలని ప్రయత్నిస్తూ అన్నాను.

"అంటే ఆలోచించడానికి ఏమీ లేదనా? ఆలోచించిందేమీ లేదనా?"

అందంగా నవ్వాలని ప్రయత్నిస్తూ నవ్వాడు.

పోరా చుంచుమొహం వెధవా......

కసిగా అనుకుని నవ్వాను.

నాకెదురుగా కుర్చీలో కూర్చున్నాడు.

తల తిరిగేలా కొట్టింది దుబాయ్ స్ప్రే పరిమళం.

అసలు వీడి ఉద్దేశమేంటో అర్థం కాదు నాకు. రోజుకి కనీసం నాలుగుసార్లు వచ్చి పలకరించి పోతుంటాడు. విషయమేమీ వుండదు. పిచ్చాపాటీ–

చిరంజీవి సినిమా మీద మీ అభిప్రాయమేంటి?

దివ్యభారతి బావుంటుందా–శ్రీదేవి బావుంటుందా?

ఇవి వాడు మాట్లాడే అతి ముఖ్యమైన విషయాలలో కొన్ని.

"ఖుదాగవా చూశారా?" అడిగాడు.

"చూడలేదు" అన్నాను.

"చూడండి. చాలా బావుంది. శ్రీదేవి ద్విపాత్రాభినయం బ్రహ్మాండం" అన్నాడు.

"ద ఎండ్ ఆఫ్ ద రొమాన్స్ చూశారా?" అడిగాను నవ్వుతూ. వాడో క్షణం నన్ను చూసి కొంచెం ఆలోచించి "చూశాను. సంగీత్‌లో వుంది కదూ" అన్నాడు.

"గొప్పగా వుంది. ఎంతైనా హాలీవుడ్ హాలీవుడ్డే–ఇంతకూ ఆ హీరో పేరేమిటండీ గుర్తుకు రావడంలేదు" ఆలోచిస్తూ అన్నాడు.

"జేమ్స్ హార్డీ"

"యస్. యస్. నటుడంటే ఆయనే సుమండీ. ఎంత గొప్పగా నటించాడు. ముఖ్యంగా క్లయిమా

క్స్‌లో" ఉత్సాహంగా అన్నాడు.

"అవును. హీరోయిన్ ఫ్లోరెన్స్ జాన్సన్ కూడా గొప్పగా నటించింది కదూ" నవ్వుతూ అన్నాను.

"అవును. అసలీ సంవత్సరం ఆస్కార్ అవార్డు ఆమెకే రావచ్చు" అన్నాడు.

"రాదులెండి" అన్నాను నవ్వుతూ.

"ఎందుకని?" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఫ్లోరెన్స్ జాన్సన్ అనే నటిగానీ, జేమ్స్ హేడ్లీ అనే నటుడుగానీ లేరు గనుక. అలాగే ది ఎండ్ ఆఫ్ ద రొమాన్స్ అనే సినిమా అసలు లేదు గనుక" అన్నాను నవ్వుతూ

రెండు క్షణాలు వెర్రిగా చూశాడు.

అంతే-విసురుగా లేచి వెళ్ళిపోయాడు.

నాకు తెలుసు. ఇంకెప్పుడూ నన్ను మాట్లాడించే ప్రయత్నం చేయడువాడు.

నవ్వుకుంటూ ఫైల్ తెరిచాను.

వారం రోజులు గడిచిపోయాయి.

బస్ స్టాప్‌లో నిల్చున్నాను.

"పెద్ద కేసట తెలుసా?"

"ఎవరు చెప్పారు?"

"ఆనంద్ చెప్పాడు"

"నిజంగానా?"

"ఆనంద్ అబద్ధం చెప్పడు"

ఓరగా చూశాను. టైపిస్ట్ జూనియర్ అసిస్టెంట్ ఇద్దరూ మాట్లాడుకుంటున్నారు.

### నిశ్శబ్ద వ్యాఖ్య

చనిపోయిన తర్వాత తమ సమాధులపై ఏం రాయాలని కొందరు ముందుగానే నిర్ణయించుకుంటారు. సుప్రసిద్ధ హాలీవుడ్ నటుడు క్లార్క్ గేబుల్ తన సమాధిపై ఇలా రాసి వుండాలని కోరుకున్నాడు.

''టాకీల నుండి మూకీలకు........''

— సేకరణ: హిమజా రమణ

వాళ్ళు మాట్లాడుకునేది ఎవరి గురించో నాకు అర్థమైంది. ది ఎండ్ ఆఫ్ ద రొమాన్స్ దెబ్బతో ఆనంద్‌గాడు నామీద ఈ విధంగా ప్రచారం చేస్తున్నాడని గ్రహించాను.

మామూలుగా నాకు చిరాకనిపించింది. అంతకు మించి నాకే ఫీలింగ్ కలగలేదు.

బస్సొచ్చింది.

ముందువేపు నుంచి ఎక్కే రోమియోల స్వర్గానం దానికి తప్పనిసరిగా అవకాశమిస్తూ లోపలికెళ్ళాను.

గుమస్తా బుర్రలో సమస్యల్లాగే బస్సు కిటకిట లాడిపోతోంది.

కండక్టర్ వచ్చాడు.

చిల్లర ఇస్తూ-కావాలని వాడి చేతిని తాకి స్టాప్ పేరు చెప్పాను. అంత రష్‌లోనూ వాడు నావేపు క్షణం ఆశ్చర్యంతో చూసి టికెట్ తీసి నా చేతి కివ్వబోయి వేళ్ళను తగిలించే కంగారులో టికెట్ కింద పడేసి నన్ను చూసి వెధవ నవ్వు నవ్వి-

"సారీ" అంటూ కిందపడిన టికెట్ తీయబోతుండగా- టికెట్ స్టాండ్ ఓ అమ్మాయికి తగిలి-

"యూ రాస్కెల్-కళ్ళు కనిపించడంలేదా?" అని అరిస్తే-

డ్రైవర్ బస్సాపి-

కండక్టర్ క్షమాపణ చెప్పాక - బస్ కదిలినప్పుడు

అప్పుడు చూశాను వాడి ముఖం.

నన్ను రోషంగా చూస్తున్నాడు.

నేను చిన్నగా నవ్వాను.

అప్పుడు నాకు జ్ఞానోదయమైంది.

సాధువు-పాము కథ గుర్తొచ్చింది. అది ప్రమాదకారి కాదని తెలిసి పిల్లలు కూడా దాన్ని రాళ్ళతో కొడుతుంటే తన మార్పుకు కారణమైన ఆ సాధువుకు పాము తన బాధ చెప్పుకుంది.

అప్పుడా సాధువు పాముతో అంటాడు.

"నువ్వు మారిపోయావు నిజమే. కాటేయమని అనను. కానీ - బుసకొట్టి భయపెట్టు. ఎవరూ నీ జోలికి రారు"

ఇప్పుడు నేను చేస్తుంది అదే.

కండక్టర్ - రోమియోలు - ఆనంద్. వీళ్ళంతా నేను తిరగబడితే బరితెగించిందంటారు.

తిరగబడకుండా భయపెడితే చాలు.

హాయిగా నిట్టూర్చాను.

ఇప్పుడు నాకే చిరాకూ లేదు.




దీపావళి శుభాకాంక్షలతో

భారతదేశం నలుమూలలా తయారయ్యే

పట్టు & ఫ్యాన్సీ చీరలు

పేరెన్నికగన్న అన్నిమిల్లుల

సూటింగ్స్, షర్టింగ్స్‌కు

అతి త్వరలో

రెడీమేడ్ గార్మెంట్స్

చందన కంచి శారీస్

లేడీస్ & జెంట్స్ క్లాత్ షోరూమ్

కోటగుమ్మం, రాజమండ్రి. ఫోన్: 75381.